www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 జులై 2023

ఎంఎఫ్ఎయు ఫలితాలు విడుదల

కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండవ, మూడవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ విడుదల చేశారు. శనివారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంతో కలిసి ఫలితాలను స్క్రీన్ పై విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ నాలుగవ సెమిస్టర్ కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లో 69 శాతం మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు. అతి తక్కువ సమయంలోనే పరీక్ష ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్ష విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ ప్రకాష్ రెడ్డి, ప్రవళిక పాల్గొన్నారు.

'మణిపూర్' ఘటనపై పెల్లుబికిన నిరసన

దాడులు ఆపకపోతే బిజెపికి గుణపాఠం తప్పదు

మారణ హోమానికి ఆజ్యం పోసిందే నరేంద్ర మోడీ

నిరసనలో అఖిలపక్ష నేతల వెల్లడి

కడప : అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మణిపూర్‌లో కుకీల తెగకు చెందిన గిరిజనులపై మేయితీ వర్గాన్ని ప్రేరేపించి దాడులకు పాల్పడుతున్న సంఘ్ పరివార్ చర్యలకు స్వస్తి పలకకపోతే రాబోయే ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. శనివారం అంబేద్కర్ కూడలిలో అఖిలపక్ష నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, టిడిపి నాయకుల లక్ష్మిరెడ్డి, జె.వి రమణ, అవ్వారు మల్లికార్జున, డాక్టర్ ఓబుల్ రెడ్డి, బిఎస్‌పి గుర్రప్ప, జెఎసి కన్వీనర్ బాబు బాయ్, సంఘ సేవకులు సలావుద్దీన్, సంఘటి మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక సంఘ్ పరివార్ తన హిడెన్ ఎజెండా అమలును ముమ్మరం చేసిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో కులం, మతం, దేశభక్తి పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ తినే తిండి పైన, కట్టుకునే బట్టల పైన ఆంక్షలు విధిస్తూ ఎస్సీ, ఎస్‌టి, బి సి, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని తన పెం పుడు సంస్థలైన అంబానీ, ఆదానీ కంపెనీలకు దోచి పెట్టేందుకు మారణ హోమానికి ఒడి గట్టిందన్నారు. వేలాదిమంది ఆస్తులను కోల్పోయి నిరాశ్రయులు అయ్యారన్నారు. ఊర్లకు ఊర్లు వదిలి అడవిలో తల దాచుకున్న వారిని రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి రక్షణ కల్పిస్తామంటూ గిరిజన బిడ్డలను తీసుకువచ్చి సంఘ్ పరివార్ మూకలకు అప్పజెబితే గిరిజన మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారానికి పాల్పడితే, అడ్డు వచ్చిన వారిని హత్య చేయడానికి కూడా వెనుకాడడం లేదని వాపోయారు. అంబానీ, ఆదానీ ఇళ్లలో చిన్న చిన్న కార్యక్రమాలకు హాజరయ్యే మోడీ 77 రోజులుగా మణిపూర్‌లో మారణహోమం జరుగుతుంటే ఎందుకు దృష్టి సారించలేదన్నారు. కేంద్ర బలగాలను రంగంలోకి దించి దాడులను అరికట్టి శాంతిభద్రతలను కాపాడలేకపోయిన మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్‌ను తక్షణం భర్తరఫ్ చేయకుండా మాన ప్రాణాలకు రక్షణ లేకుండా సర్వం కోల్పోయిన కుకీలను పరామర్శించేందుకు వెళ్లినవారిపై కేసులు నమోదు చేసిన ఘనుడు నరేంద్ర మోడీ అన్నారు. ప్రజాస్వామిక వాదులు అందరూ సమైక్యంగా ఉద్యమించి సంఘ్ పరివార్ దుశ్చర్యలను ఎండగట్టాలని, రాబోవు రోజుల్లో బిజెపికి రాజకీయ సమాధి కట్టాలని వారు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకట శివ, గుంటి వేణుగోపాల్, నాగ సుబ్బారెడ్డి, కె సి బాదుల్లా, బషీర్‌ఉనేసా, సుబ్రహ్మణ్యం, ఓబయ్య, మైనుద్దీన్, మునయ్య సావంత్ సుధాకర్, భాగ్యలక్ష్మి, బ్రహ్మం సుబ్బరాయుడు, సిపిఎం నాయకులు రామ్మోహన్, చంద్రారెడ్డి, అన్వేష్, మక్బూల్ మైనారిటీ నాయకులు, హమీద్, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

మోడీ నైతిక బాధ్యత వహించాలి : సలావుద్దీన్

మాట్లాడుతున్న సలావుద్దీన్

మణిపూర్ రాష్ట్రంలో సభ్య సమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించి, మాన భంగం చేసి చంపి న అల్లరి మూకలను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని మైనారిటీ నేత, ప్రముఖ సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్ డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రం రావణ కాష్టంలా కాలుతుంటే నరేంద్రమోడీ సారధ్య లోని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా, కంచే చేను మేసినట్లుగా ఉండటం దుర్మార్గ మన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని మణిపూర్ బాధితులకు తక్షణం న్యాయం చేయాలని అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ కిరాతక చర్యలను అరికట్టలేని ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

జమ్మలమడుగు రూరల్ : మణిపూర్‌లో మహిళలపై, ఒంగోలులో గిరిజనుడిపై జరిగిన సంఘటనల పై మోడీ, జగన్మోహన్ రెడ్డిలు ఇద్దరూ బాధ్యత వహించాలని చర్యలు తీసుకోవాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ తెలిపారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ తక్షణమే మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. . శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ అర్ లక్ష్మీదేవి, మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో మత కలహాల సృష్టించి చర్చిలు తగలబెడుతూ, క్రిస్టియన్ పాస్టర్లను చంపుతున్నారని, ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం బిజెపి హిందుత్వ ఎజెండాలో భాగమేనని చెప్పారు. తక్షణం మోడీ ప్రభుత్వ మతో న్మాద చర్యలను ఖండించాలని, లేకపోతే మాణిపూర్ ప్రయోగం దేశవ్యాప్తంగా బిజెపి, ఆర్ఎస్ఎస్ అమలుచేస్తుందని హెచ్చ రించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి, కమాల్ బాషా, సుద్ధపల్లి, బీమా పాల్గొన్నారు.

ఎంపిజె ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా నడిపించి, తరువాత వారిపై అత్యాచారం చేసిన దుర్మార్గులను నిర్భయ చట్టం కింద కఠినంగా శిక్షించాలని ఎంపిజె (మూవ్‌మెంట్ పీస్ అండ్ జస్టీస్) రాష్ట్ర కార్యదర్శి షేక్‌సలీం అన్నారు. మణిపూర్‌లో అల్లర్ల బాధితులకు సంఘీభావంగా శనివారం సాయంత్రం ఎంపిజె ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో ఎన్నో రోజులుగా నరమేధం జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి మణిపూర్‌రాష్ట్ర ప్రజలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జాకీర్, పట్టణ అధ్యక్షులు హుసేన్‌బాష పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో..

కడప : దేశ మహిళలకి రక్షణ కల్పించడంలో బిజెపి ఘోరంగా విఫలమయ్యిందని నగర మహిళ అధ్యక్షురాలు లావణ్య ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం యర్రముక్కపల్లి సర్కిల్లో లావణ్య అధ్యక్షతన కళ్లకు నల్ల రిబ్బన్ ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్ మహిళల గ్యాంగ్ రేప్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో నగర అధ్యక్షులు విష్ణు ప్రీతమ్ రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాసులు, కుల్లయ్యప్ప, బాబు, శివ, తిరుమలేశుని, ప్రసాద్, సిద్దు, మహిళ నాయకురాలు మల్లిక, నౌషాద్, పల్లవి,రోజా, గౌషియ, ముంతాజ్, ఫాతిమా, దీప, రమాదేవి, లక్ష్మి దేవి, సుధ, శ్యామలా, అరుణ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందులరూరల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వ్యవసాయం చేసే ప్రతి రైతునూ శాస్త్రవేత్తను చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దేశంలోనే మొదటిసారిగా పులివెందులలోని ఏపీకార్ల్‌లో రైతు శాస్త్రవేత్త శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏపీ కార్ల్ ఏర్పాటు చేసిన రైతు శాస్త్రవేత్త శిక్షణ శిబిరాన్ని ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా ఏపీ కార్ల్ సిఇఒ రమణారెడ్డి మంత్రికి బుకే అందిం చి స్వాగతం పలికారు. ప్రకృతి వ్యవసాయం సంబంధించి స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పరిశీలించారు. అంతకు ముందు ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు పరిశోధన కోర్సు అకాడమిక్ మొదటి బ్యాచ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్న సుభిక్షంగా ఉండాలని సిఎం ఎన్నో పథకాలను తీసుకువచ్చి వారికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. వ్యవసాయంలో రసాయన ఉపయోగాన్ని పూర్తిగా తగ్గించి సహజసిద్ధమైన ఎరువులను వాడటం వల్ల, పర్యావరణ సహిత ఆరోగ్యకరమైన దిగుబడులను ఉత్పత్తి చేయడం రైతు శాస్త్రవేత్త కోర్సు ముఖ్య ఉద్దేశమని అన్నారు. అందుకు అనుగుణంగా సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయి అవగాహన పెంపొందించడం, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమలు చేస్తున్న పలు సహజసిద్ధ సాగుబడి పద్ధతులను పరిచయం చేస్తారని చెప్పారు. రైతు శాస్త్రవేత్తలను కోర్సు ద్వారా రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం శరవేగంగా వ్యాప్తి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కోసం తయారు చేసిన మాడ్యుల్స్‌ను తరగతి గదుల్లో బోధిస్తారని చెప్పారు. రైతు శాస్త్రవేత్తలు తమ సొంత పొలంలో 'ఎ' గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ నమూనాలను తయారు చేయడం, వ్యవసాయ పాఠశాలలను నిర్వహించడం కమ్యూనిటీ శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. తొలి రెండేళ్లలో వెయ్యి మంది రైతు శాస్త్రవేత్తలను, ఆ తరువాత ప్రతి ఏటా రెండు నుంచి మూడువేల మంది రైతు శాస్త్రవేత్తలను తయారు చేయాలని రైతు సాధికార సంస్థ లక్ష్యంగా ఎంచుకుందన్నారు. కార్యక్రమంలో జెసి జి.గణేష్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్ రెడ్డి, ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో వెంకటేశులు, పురపాలిక చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, కమీషనర్ నరసింహా రెడ్డి, మార్కెట్ చైర్మన్ చిన్నప్ప, ప్రత్యేకాధికారి శివారెడ్డి హాజరయ్యారు.

సూక్ష్మ సేద్య పరికరాలను ప్రారంభించిన మంత్రి

ఐజి కార్ల్ ప్రాంగణంలో ఎపి మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా సూక్ష్మ సేద్యం, ఉద్యాన పంటల సాగునీటి సదుపాయం కోసం దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందిన రైతులకు సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా రెండు వేల హెక్టార్లకు పైగా సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఒక్కక్కరిగా లబ్దిదారులకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, ఎడి అశోక్ రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్లు, మెంటార్లు, కోర్సులో చేరిన రైతులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలని ఆర్‌జెడి కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం మండలం వనరుల కేంద్రంలో సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాగితాల పెంటలో 1 నుంచి 5 తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత చెమ్ము మియా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతిగదిలో విద్యార్థులకు సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలు అందాయా లేవా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసుకుని ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠ్య ప్రణాళిక రాయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి నోట్ బుక్స్ పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థి పట్ల స్నేహపూర్వక వాతావరణంలో బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ, జిల్లా పరిషత్ చెమ్ముమియ్య పేట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరీ, ప్రాథమిక పాఠశాల కా పెంట ప్రధాన ఉపాధ్యాయులు బాలా నాయుడు, సీఎంఆర్టీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

అట్లూరు : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు అన్నారు. శనివారం అట్లూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, తహశీల్దార్ శ్రీవాణి అధ్యక్షతన 2023 ఈ క్రాప్ పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రాప్ సక్రమంగా నిర్వహించాలని ఆయన తెలిపారు రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జి విఆర్ఓలు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణం పదిలం

ప్రజాశక్తి - కడప

మొక్కలతో పర్యావరణం పదిలముగా ఉంటుందని కడప ఎల్ఐసి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ జి.సంజీవ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం 'ప్లాంట్ ఎ లైఫ్' ఆధ్వర్యంలో సిఎస్ఐ ఉన్నత పాఠశాలలో 100 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 31లోపు రెండు కోట్ల మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో శాటిలైట్ మేనేజర్ జి. వెంకటకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ విజయ్ కుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సుదేవి, ఉపాధ్యాయులు ప్రేమ్ సాగర్, ఎల్ఐసి దీపక్, ఆదిదేవుడు, ఏజెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలతో విద్యార్థులు

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధా

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కలసపాడు

తమ గ్రామంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని మండలంలోని రాజుపాలెం ఎస్‌సి కాలనీ వాసులు బద్వేల్ ఎమ్మెల్యే సుధాకు విన్నవించారు. శనివారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అలాగే గ్రామంలోని సమస్యలను అడగ్గా గ్రామంలో తాగునీటితోపాటు రోడ్లు, డ్రెయినేజీ సమస్యలున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. పంచాయతీకి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటిలో త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మహబూబ్‌బీ, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు, అన్నా రెడ్డి, భాస్కర్ రెడ్డి, జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, ఎంపిపి బోధనబోయిన నారాయణ, జెసిఎస్ మండల కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, లిడ్ క్యాప్ డైరెక్టర్ సగిలి సుదర్శన్, సింగల్ విండో అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి స్పెషల్ ఆఫీసర్ ఎడి మురళీధర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుజిత్, సోషల్ వెల్ఫేస్సిస్టెంట్ గుర్రప్ప, ఐసిడిసి సూపర్‌వైజర్ రత్న కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లా బకాష్, పిఆంసి హసీనా పర్వెజ్ , హౌసింగ్ ఎఇ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దూషణలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓటమి భయంతోనే, ప్రతిపక్షాలను దూషించడమే పనిగా పెట్టుకున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందనో, సర్వేలో ఓడిపోతానన్న భయంతో జగన్ ప్రతిపక్ష నేతలపై దూషణలకు తెరలేపారని చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వాలంటరీ వ్యవస్థపై మాట్లాడితే, జగన్ వేరే దారి లేక ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ ఖర్చులతో సమావేశం పెట్టి ప్రతిపక్షాల ను దూషించడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి తండ్రి వయసున్న చంద్రబాబుపై విమర్శలా అని నిలదీశారు. నాలుగేళ్ల పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని, ఉన్న కొద్ది కాలంలో రాష్ట్రానికి మేలు చేస్తే కాసింతైనా ప్రజాభిమానం పొందుతారని వైసిపి నేతలకు హితబోధ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

52 కేసులు పరిష్కారం : జడ్జి

ప్రజాశక్తి - కడప

కేసులను పరిష్కరిస్తున్న జడ్జిలు

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 52 కేసులు పరిష్కరించి, కక్షిదారులకు రూ.3 కోట్ల 18 లక్షల 15 వేలను చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయ మూర్తిపి. అన్నపూర్ణ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం మోటార్ వాహనాల ప్రమాదాలు, భూ సేకరణకు సంబంధించిన కేసులకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 3 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కడపలో, ప్రొద్దుటూరు, రాయచోటిలలో ఒకొక్క బెంచ్‌లు చేసినట్లు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక లోక్ అదాలత్ లో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకు గాను న్యాయవాదులకు, అధికారులకు, వైద్య అధికారులకు, డిస్ట్రిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, ఆకాశవాణి, కడప వారికి, అడ్వకేట్ క్లర్కు లకు ఈ సందర్భంగా జడ్జిలు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట్లాడుతున్న ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ఎన్‌జిఒ రాష్ట్ర కౌన్సిల్ విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ విజయవంతం చేద్దామని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం ఎన్జీవోహోంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కె.వి. శివారెడ్డి ఆదేశాలు ప్రకారం రాష్ట్ర కౌన్సిల్ విజవంతం చేస్తామని పేర్కొన్నారు. కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్,జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, జిల్లా కార్యవర్గం, సిటీ, తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు. ఆగస్టు 21,22వ తేదీ ల్లో విజయవాడలో రాష్ట్ర కౌన్సిల్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి తాలూకా, జిల్లా నుంచి ఉద్యోగులు 1500 మంది పైగా వచ్చి విజయవంతం చేస్తామన్నారు.

పాఠశాలల సముదాయం పరిశీలన

చెన్నూరు : స్థానిక బాలలుర ఉన్నత జిల్లా పరిషత్ పాఠశాలల సముదాయాన్ని ఎంపీపీ చీరల సురేష్ యాదవ్, ఎంఇఒ గంగిరెడ్డి శనివారం పరిశీలించారు.జ పాఠశాల అభివృద్ధి పనులను, వసతులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పిల్లలకు అందజేస్తున్న మధ్యాహ్న భోజ నాన్ని తనిఖీ చేశారు. పాఠశాలకు వచ్చిన డిజిటల్ టీచింగ్ టీవీల గురించి ఉపాధ్యాయులు పిల్లలకు బోధించే విధానాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు త్వరలోనే నాబార్డ్ నిధులతో పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని ఎంపిపి చెప్పారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-చెన్నూరు

మందులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్ఒ నాగరాజు వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక ఆరోగ్యశాఖప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామనపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. రామనపల్లిలో నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కంటి వెలుగులో అర్హులందరికీ పరీక్షలు చేయాలని, అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేయాలని సూచించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని రిమ్స్ హాస్పిటల్‌కు పంపించాలని ఆదేశించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా నీటి నిలువలు గుంతలు ఉంటే వాటిని వెంటనే పూడ్చివేయాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపి, ఐపి సేవలను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పై చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ మూర్తి

మానవుని నిత్య జీవితానికి 'పై' అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల దైనందిన జీవితం, వివిధ అధ్యయన రంగాలలో 'పై' ఆవశ్యకత ఎంతైనా ఉందని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి తెలిపారు. శనివారం పై దినోత్సవం సందర్భంగా గణిత శాస్త్ర పితామహుడు అర్కి మెడిస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బిటెక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడుతూ సాంకేతిక ,ఆర్కిటెక్చర్, భవన నిర్మాణ ఇంజినీరింగ్ రంగాలలోను, గోపురాల లోనూ, కంప్యూటర్ గ్రాఫిక్స్, మోడలింగ్, డిజిటల్ పరిశ్రమల రంగాలలోను, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, తయారీ రంగాలలోను, గణిత శాస్త్ర భావనలకు సోపానం, సమస్యల పరష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ఐ. శ్రీవాణి, ప్రోగ్రాం కార్యనిర్వాహక అధ్యక్షులు వై. సతీష్‌కుమార్‌రెడ్డి, కె. రాజేశ్వరమ్మ, కార్యనిర్వాహక సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగస్టు 6న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సీనియర్ పాత్రికేయులు చౌడం సూరిబాబు పిలుపునిచ్చారు. చేనేత దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను శనివారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కోశాధికారి బొమ్మి శెట్టి చంద్రశేఖర్, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సీనియర్ పాత్రికేయులు చౌడం నాగార్జునతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఆగస్టు 6న ప్రెస్ క్లబ్ లో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న 74 మంది నేతన్నలకు ఆత్మీయ సత్కారాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్రలో చేనేతరంగం ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చేనేత కార్మికులకు ఆత్మీయ సత్కారాలు, కేక్ కటింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

ఐక్య పోరాటాలే శరణ్యం

కడప అర్బన్ : పెరుగుతున్న విద్వేష ధోరణులు, ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరచడం, అస్తిత్వవాద ధోరణులు, కార్మిక హక్కుల నిర్వీర్యం కార్మికవర్గం ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలని, వీటిని అధిగమిస్తే కార్మిక వర్గానికి భవిష్యత్తు అని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పి.సతీష్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయ ఆవరణలో యూనియన్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న అంతరాలు, నిరుద్యోగ సమస్యలతో సతమతమయ్యే తరగతులతో కలిసి మనం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య మాట్లాడుతూ వస్తు సేవల పన్ను, ఐడిఆర్డిఏ సృష్టిస్తున్న సమస్యలను బీమా రంగం ఎదుర్కొంటోందని అన్నారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసి పాలసీదారుల, ఇన్వెస్టర్ల, కస్టమర్ల నమ్మకం కొనసాగేలా వారికి త్రికరణ శుద్ధిగా సేవలు అందించాలన్నారు. ఐసిఇయు కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ నేతలు అక్బర్ బాషా, వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, ఖాన్, కుమార్, శ్రీకృష్ణ, వసుప్రద, హబీబ్, శేఖర్ రెడ్డి, కళ్యాణ్ పాల్గొన్నారు.

చెరువు మట్టినీ వదలని వైసిపి

కడప అర్బన్ : పుట్లంపల్లి చెరువు మట్టిని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు యథేచ్ఛగా దోచుకుంటున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపి పోలిట్ బ్యూరో సభ్యుడు అర్.శ్రీనివాస రెడ్డి విమర్శించారు. శనివారం కుట్లంపల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, కొండలో మట్టి దోపిడీ జరుగుతుందని కొద్ది రోజులుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అండదండలతో మేయర్, కార్పొరేటర్లు ఎద్దేచ్ఛగా మట్టి అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

పోరుబాట

ప్రజాదృష్టి

బద్వేల్ పోరాటానికి చిరునామాగా నిలుస్తోంది. ఇటీవల గోపవరం మండలం మడకలవారిపల్లి గ్రామస్తులు తమ గ్రామానికి సమీపంలోని 60 ఎకరాల్లో స్మార్ట్ టౌన్‌షిప్ నిర్మాణ ఏర్పాట్లకు వ్యతిరేకంగా సాగిన పోరు అద్భుతమని చెప్పవచ్చు. పోలీసుల కర్కశ అణచివేతను సమర్థవంతంగా ఎదురొడ్డిన తీరు అబ్బురానికి గురిచేసింది. పోలీసులు కర్కశానికి వ్యతిరేకంగా మహిళా మణులు సాగించిన వీరోచిత పోరాటం ఎన్నదగినది. జగనన్న స్మార్ట్‌టౌన్ షిప్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మడకలవారిపల్లి ఎత్తిన నిరసనగళం నిరుపమానమని చెప్పకతప్పదు. ప్రజాతంత్ర సమరశీల పోరాటాలకు సిపిఎం వంటి కమ్యూనిస్టు పార్టీలు పేరుగడించిన సంగతి తెలిసిందే. అటువంటి సిపిఎం బద్వేల్ నియోజకవర్గ కేంద్రంలో పట్టును కలిగి ఉంది. అటువంటి పార్టీ గతంలో సాగించిన పోరాటాలను గమనించిన ప్రజలు సమరశీల పోరాటాలకు దిగడం విస్మయాన్ని కలిగించింది. ఇటువంటి తరహా చైతన్యం ఇతర సమస్యలపై కమ్యూనిస్టు పార్టీల సారథ్యంలో సాగిస్తే పెత్తం దారీతనం మటుమాయమై సమ సమాజం సాధ్యమవుతుందని చెప్పవచ్చు. ఏదేమైనా ప్రజాతంత్ర శక్తులు చైత న్యాన్ని సంతరించుకోవడం స్వాగతించవలసినదే. బ్రహ్మంగారి కాల జ్ఞానంలో బద్వేల్ బస్తీ అవుతుందన్న సంకేతాల నేపథ్యంలో బద్వేల్ పట్టణ సమీపంలోని భూములపై కొన్నేళ్లుగా రాజకీయ నాయకుల కన్ను పడింది. ఫలితంగా ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ వాలి పోయి బోగస్ పట్టాలు సృష్టించడం పరిపాటిగా మారింది. జిల్లా కేంద్రాన్ని తలదన్నే రీతిలో భూముల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ఇటు వంటి కబ్జాదారుల ఆటలు కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి స్థలాల్లో జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్‌లను నిర్మిస్తే ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని పాలకులు గ్రహించాలి. మడకలవారిపల్లి గ్రామ సమీపంలోని భూముల్లో టౌన్‌షిప్‌లు నిర్మిస్తే గ్రామానికి సంబంధించిన పశువు సంపద సంచరించడానికి, మేతకు ఉద్దేశించిన స్థలం మాయమ వుతుందని భయపడినట్లు కనిపిస్తోంది. ఫలితంగా గ్రామీణ రైతుల జీవనాడి పాడి పరిశ్రమ. ఇటువంటి గ్రామీణ పేద రైతుల జీవనా ధారం కళ్ల ముందే కరిగిపోతున్న నేపథ్యం కళ్ల ముందు కదలాడింది. మడకలవారిపల్లి గ్రామీణులు స్ఫూర్తిదాయకమైన రీతిలో సమరశీల పోరాటానికి దిగడం సముచితమనే చెప్పవచ్చు. ఇప్పటికైనా పాలకులు సమస్యను సానుభూతితో అర్థం చేసుకుని ఇతర ప్రాంతాల్లో టౌన్ షిప్‌లు, పరిశ్రమలు, ఇతర నిర్మాణ అవసరాలకు భూ ములు, స్థలాలు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు. లేనిపక్షంలో ఇటువంటి నిరసనాగ్నులను ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి

మధ్య తరగతికి మంచి అవకాశం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

జగనన్న స్మార్ట్‌టౌన్ షిప్ మధ్యతరగతి కుటుంబీకులు సొంతింటికలను నెరవేర్చుకునేందుకు మంచి అవకాశమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. అన్నమయ్య అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొర్రపాడురోడ్డులోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఎలాంటి వివాదాలు లేకుండా అన్ని అనుమతులతో కూడిన 45 ఎకరాలు భూమిని సేకరించామన్నారు. ఇందులో 25 ఎకరాలు ఇళ్లకు, మిగిలిన 40 ఎకరాలు మౌలిక వసతులకు కేటాయించామని చెప్పారు. రూ.29కోట్లతో టెండర్‌లు కూడా పూర్తయ్యాయని చెప్పారు. ఈ ప్రాంతంలో సెంటు రూ.8లక్షలకు పైబడి ఉందని, ప్రభుత్వం కేవలం రూ.5 లక్షలకే అమ్మకానికి పెట్టిందన్నారు. ఈ అభివృద్ధిలో టిడిపి వారిని కూడా అహ్వానిస్తున్నామన్నారు. ఆయా పట్టణాలలో వ్యాపారం చేసి వచ్చిన లాభాన్ని పట్టణాభివృద్ధికి వెచ్చించేలా ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ విధానం ద్వారా ప్రొద్దుటూరును బృందావనంగా తయారుచేస్తామన్నారు. అథారిటీ ఛైర్మన్ గురుమోహన్ మాట్లాడుతూ ప్లాటు విస్తీర్ణం 3,4,5 సెంట్లుగా ఉంటుందని దరఖాస్తుతో పాటు మొత్తం ప్లాటు విలువలో 10 శాతం చెల్లించి ప్రతి మూడు నెలలకు 30 శాతం చొప్పున సంవత్సరం లోపు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అగ్రిమెంట్ తేదీ నుండి మొత్తం విలువ ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ విధానం ద్వార మధ్యతరగతి కుటుంబీకులు అన్ని సౌకర్యాలతో కూడిన సొంతింటికలను సాకారం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. సమావేశంలో కమిషనర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనను పెంచుకోవాలి

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ఆలోచనను పెంచుకోవాలని జనవిజ్ఞానవేదిక (జెవివి) ప్రధాన కార్యదర్శి సునీత అన్నారు. జెవివి ఆధ్వర్యంలో స్థానిక స్కాలర్స్ పాఠశాలలో శనివారం 'శాస్త్రీయఆలోచన అంటే ఏమిటి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంవృద్ధి చెందాలంటే శాస్త్రసాంకేతిక రంగాల్లో ముందుండాలని తెలిపారు. విరసం సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ కోడిగుడ్డును దిష్టితీయడం కంటే ఉడకపెట్టుకొని తినడం ఉపయోగం అన్నారు. ప్రతి అంశాన్నీ శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు.లాయర్ హరిత మాట్లాడుతూ గ్రహణాలను సైన్స్ అంశంగా చూడకుండా దాని చుట్టూ అనేక మూఢనమ్మకాలు పాటించడం సరికాదని తెలిపారు. ప్రశ్నించడం వల్లనే సమాజం మారుతుందన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు తవ్వా సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు, యువ నాయకులు కటికరెడ్డి గుణవంతరెడ్డి ఆలయాల అభివృద్ధికి చేయూత నిస్తున్నారు. మండలంలోని బడుగువారిపల్లె, రాఘవాపురం గ్రామాల్లోని రాముని ఆలయాలకు కటికరెడ్డి కుటుంబం తరపున మధుసూదనరెడ్డి తల్లిదండ్రులు రామసుబ్బారెడ్డి, ఓబులమ్మ జ్ఞాపకార్థం తన సొంత నిధులు రూ. 3 లక్షలు విలువ చేసే గ్రానైట్ వితరణ చేసి సప్పట ఏర్పాటు చేశారు. ఆలయాల అభివృద్ధికి సహకరించిన దాతలకు పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు మైలవరం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- మైలవరం

ఎంపిపి సావిత్రమ్మ ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచులు, అధికారులు, ఎంపిటిసి, జడ్‌పిటిసి సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు. మండల అభివృద్ధికి సంబంధించిన సమాచారాన్ని తీసుకురావాలని తెలిపారు.

26న వాహనాలకు వేలం పాట

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

వివిధ కేసులలో జప్తు చేసిన మోటార్ వాహనాలకు ఈనెల 26న బహిరంగ వేలం వేయనున్నట్లు అర్బన్ పోలీసులు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు పులివెందుల పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలం నిర్వహిస్తామని ఆసక్తి గలవారు పాల్గొన వచ్చున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- కొండాపురం

మండలంలోని ప్రతి కార్యకర్తా టిడిపి అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం శ్రీ రాఘవేంద్ర స్వామి కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు సైనికులుగా పని చేయాలని కోరారు. అనంతరం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రతి కార్యకర్తా సైనికుడు లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పోల్ మేనేజ్మెంట్, పార్టీ బలోపేతనం అంశాలపై మాట్లాడారు. మీ ప్రాంతాలలో ఫేక్ ఓట్లు నమోదు చేయించి ఉంటే గుర్తించి తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి పరిశీలకులు మద్దుకూరి సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ శివనాథ రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సంబంధాల బాధ్యులుగా ఈశ్వరయ్య



ఈశ్వరయ్య

పోరుమామిళ్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లెక్చరర్, ప్రముఖ కవి, సామాజిక కార్యకర్త యంబడి ఈశ్వరయ్యను ప్రజా సంబంధాల బాధ్యులుగా (పిఆర్ఒ) ఎన్నుకున్నారు. పదమూడు సంవత్సరాలుగా కళాశాలకు చేసిన సేవలనను, కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థిగా తనవంతుగా చేస్తున్న సేవలను, ప్రజలతో గల సత్సంబంధాలను గుర్తించి బాధ్యతలను అప్పగించామని ప్రిన్సిపల్ చెప్పారు.

క్రైం కార్నర్

కూతురిని చంపిన కేసులో తండ్రికి రిమాండ్

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని ఎగువపల్లిలో కన్న కూతురిని చంపిన కేసులో కోర్టు రిమాండ్ విధించింది. సిఐ మద్దిలేటి వివరాల మేరకు.. 2021 జనవరి 19న ఎగువపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి తన కూతురు జయంతిని పెట్రోల్‌పోసి తగలబెట్టాడు. ఈ సంఘటనలో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. తరువాత తన కూతురు ఆరోగ్యం బాగోలేక ఆత్మహత్య చేసుకుందని పుకార్లు పుట్టించాడు. పోలీసుల విచారణలో అతను పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారికి అనుమానం వచ్చి దర్యాప్తు చేశారు. కన్న కూతురిని తండ్రి నారాయణరెడ్డి పెట్రోల్ పోసి తగలబెట్టడని రుజువు చేయబడింది. ఇందుకు సంబంధించి కడప కోర్టు అతనికి రిమాండ్ విధించడంతో శనివారం కడప సబ్ జైలుకు తరలించినట్లు సిఐ తెలిపారు

అధ్వానంగా కెసి ఉపకాల్వ

పూర్తిగా దెబ్బతిన్న లైనింగ్
పిచ్చిమొక్కలతో స్తంభించిన నీటి పారుదల
పట్టని అధికారులు - ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి -ఖాజీపేట

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతన్నలు వర్షాలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ బోర్ల కింద నారుమళ్ల వేయడానికి రైతన్నలు సంసిద్ధమయ్యారు. భూసారం కోసం కొన్నిచోట్ల జీలగను సాగుచేశారు. మండలంలో వ్యవసాయ బోర్ల కింద ముందస్తుగా వరి నాట్లకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. కెసి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటూరు, కొండపేట ప్రధాన కాలువలకు సంబంధించి ఉపకాల్వలు అధ్వానంగా ఉన్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపకాలవలు వెంబడి కంప చెట్లు పెరగడంతోపాటు, కాలువ లైనింగ్ పూర్తిగా దెబ్బ తినడంతో పలుచోట్ల సాగునీటికి ఆటంకంగా మారిందని అన్నదాతల ఆవేదన వ్యక్తపరిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న దృష్ట్యా కెసి కాలువలపై పర్యవేక్షణ నుంచి సాగునీటి ప్రవాహం సాఫీగా సాగేలా కాలువలు వెంబడి ఉన్న కంప చెట్లను తొలగించడంతోపాటు, పిచ్చి మొక్కలు, జమ్ము తొలగించి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుచున్నారు. మండల వ్యాప్తంగా కెసి ఆయకట్టు కింద దాదాపు 16 వేల ఎకరాలు వరి పంటను సాగు చేస్తుంటారు. ఇప్పటికైనా సాగునీటి పారుదల అధికారులు స్పందించి సమస్య లేకుండా చూడాలని రైతన్నలు కోరుచున్నారు.

కంప చెట్లతో ఉన్న కొండపేట కెసి ఉపకాలవ

ప్రజా సంక్షేమమే జగనన్న సురక్ష లక్ష్యం

వేంపల్లె : మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

పరిపాలనను ఇంటి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే సురక్ష లక్ష్యమని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రీ పేర్కొన్నారు. శనివారం స్థానిక చింతలమడుగుపల్లెలోని 8వ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని తెలిపారు. ఇళ్ళులేని వారందరికీ ఇంటి స్థలాలను మంజూరు చేసి సొంత ఇంటి కలను నెరవేర్చారని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆదాయం, కుల ధృవీకరణ పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు రహంతుల్లా ఖాన్, కటిక చంద్ర శేఖర్, హసనయ్య, సచివాలయ కన్వీనర్లు గంగరాజు, ఇస్మాయిల్, సచివాలయ కార్యదర్శి కోండయ్య, వార్డు మెంబరు బాలరాజు, గుజిరి దర్బార్, షామీర్, మాజీ వార్డు మెంబరు చలమారెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడులో.. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎంపిపి టి.లక్షుమయ్య అన్నారు. చాపాడులో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్ రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, ఎఓ మ్యాగీ, ఆర్ఐ ప్రమీల, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి , గృహ సారథుల మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ మహబుబ్‌బీ, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ముద్దనూరు : ప్రజాక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని మండల సచివాలయం కన్వీనర్ చింతాటి సుమంత్ యాదవ్, ముద్దనూరు సర్పంచ్ బోనం సరళ అన్నారు .స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో శనివారం ముద్దనూరు-2 సచివాలయం పరిధిలోని ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు .అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్య నారాయణ రెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మేజర్ పంచాయతీ సెక్రటరీ నరసింహులు, జెడి ఇంద్రాణి పాల్గొన్నారు.

మైలవరం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపిపి సావిత్రమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని తొర్రివేములలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, తహశీల్దార్ తిరుపతయ్య , వైసిపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మార్తల గురివిరెడ్డి పాల్గొన్నారు..

ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ మంత్రి వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసులో నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరగాలంటే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైసిపి ప్రభుత్వం నిందితులకు కొమ్ము కాస్తున్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం సకాలంలో చార్జిషీట్ వేయని కారణంగా ఎ1 నిందితుడైన ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ 9 నెలల 11 రోజులు దర్యాప్తు చేసినప్పటికీ కేసు ఒక కొలిక్కి రాలేదని చెప్పారు. జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు సిబిఐ విచారణ చేయాలని చేసినట్లు తులసిరెడ్డి గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక సిబిఐ విచారణ వద్దని హైకోర్టుకే చెప్పారని తెలిపారు. దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని ఎ5 నిందితునిగా సిబిఐలో చార్జిషీట్‌లో చేర్చినప్పటికీ అతనిపై పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. కడప వదలి వెళ్లాక పోతే బాంబులు వేసి చంపేస్తామని ఓ సామాన్యుడు సిబిఐను బెదరిస్తున్నాడు అంటే ఆశక్తి ఎక్కడ నుంచి వచ్చిందో అందరికీ తెలుసు అన్నారు. రాజకీయ పెద్దల భరోసాతోనే సిబిఐని బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పెద్దలుఅండ లేకపోతే ఎ6 నిందితుడు ఉదయ్ కుమార్ రెడ్డి సిబిఐ అధికారి రామ్ సింగ్ పై కేసు పెట్టగలడా అని విమర్శించారు. ఎ8 గా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డిని సిబిఐ అరెస్టు చేయకుండా, విచారించకుండా పార్టీ, ప్రభుత్వ యంత్రాంగాన్ని నియంత్రించింది వాస్తవం కాదా అన్నారు. బాహ్య ప్రపంచానికి తెలియక ముందే హత్య విషయం సిఎం జగన్‌కు తెలిసినట్లు తెలుస్తున్నట్లు చెప్పారు. వివేక హత్యకు రాజకీయ కారణమని షర్మిలా వాంగ్మూలం ఇవ్వడం గర్హనీయమని అన్నారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కూడాసిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

పంట నమోదు పక్కాగా చేపట్టాలి

చాపాడు : మాట్లాడుతున్న ఎఒ మ్యాగీ

ప్రజాశక్తి - చాపాడు

రైతులు సాగుచేసిన ప్రతి సర్వే నెంబర్‌లోని పంటను ఈ నమోదు చేయాలని వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో విఆర్ఒ, విఎఎలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా చూసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటేతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మాస్టర్ ట్రైనర్ సిబ్బందికి ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమీల, ఎఎస్ఒ గరుడాచలం, విఆర్ఒలు, విఎఎలు పాల్గొన్నారు.

వేంపల్లె : ఖరీఫ్ 2023లో రైతులు సాగు చేసిన పంటలకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది కలిసి పంట నమోదును చేయాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాఫ్ పై వ్యవసాయ శాఖ సిబ్బందికి, రైతు భరోసా సిబ్బంది, విఆర్ఒలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ - 2023 ఎడాదికి సంబంధించి జాయింట్ అజామాయిషి కింద వ్యవసాయ, రెవెన్యూ శాఖ అనుబంధం ద్వారా ఈ పంట నమోదును చేపట్టాలని సూచించారు. పంట నమోదులో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని చెప్పారు. ఇందుకు ప్రత్యేక యాప్ కూడా ఉందని చెప్పారు. ప్రతి రైతూ విధిగా సాగు చేసిన పంటలకు ఈ క్రాఫ్ చేయించుకోవాలని కోరారు. పంట కాలం పూర్తి అయిన తర్వాత ఆయా సచివాలయం పరిధిలో పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తారని చెప్పారు. పంటను నమోదు చేసుకొనేందుకు సెప్టెంబర్ 20 వరకు గడువు ఉందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, రైతు భరోసా ఇన్‌ఛార్జులు, విఆర్ఒలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఎడిఎ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎఒ వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షతన క్షేత్ర స్థాయి సిబ్బందికి శనివారం పంట నమోదుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సంబంధించి రైతులు సాగు చేసిన పంట వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విఆర్ఒ , సర్వేయర్, వ్యవసాయ శాఖ సిబ్బంది కలిసి అను సంధానంగా పంట నమోదు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో కౌలుకు చేసుకునే రైతులు వివరాలను గుర్తించి వారికి కౌలు కార్డులు ఇచ్చేలా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో శనివారం ఖరీఫ్ పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి రైతూ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. నమోదు విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించారదని , విఎఎ, విఆర్ఒలు, పంట నమోదు యాప్‌పై అవగాహన అవసరమన్నారు. విఆర్ఒలు రికార్డులు తప్పనిసరిగా తీసుకెళ్లాలని , ప్రతి రైతుకూ పంట ధ్రువీకరణ పత్రం అందించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన పంట నమోదు యాప్‌కు ఇప్పటి యాప్‌కి కొద్దిపాటి తేడాలున్నాయని, వాటిని గమనించి నమోదు చేయాలని సూచించారు. ఎటువంటి అవకతవకలకు పాల్ప డరాదని చెప్పారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట బీమా, నష్టపరిహారం దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ శాఖ కార్యాలయం ద్వారా నియమించిన శిక్షణ అధికారి చిట్టిబాబు, విఎఎలు, విఆర్ఒలు పాల్గొన్నారు.

27లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-కొండాపురం

మండలంలోని రైతులు ప్రధానమంత్రి కిసాన్ యోజన కోసం ఇకెవైసి ఈనెల 27లో తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎవి. రామాంజుల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మురగంపల్లెలో పొలంబడిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుద్దేశించి మాట్లాడుతూ మండలంలో ఇంకా ఇకెవైసి చేయని రైతులు 211 మంది ఉన్నారని, వారంతా గడువులోగా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. వేరుశనగ పంట సాగుచేసే రైతులు కిలో వేరుశనగ విత్తనాలకు ఐదు గ్రాములు 'ట్రైకోడర్మ విరిడి' మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. పొలం చుట్టూ కంచెగా నాలుగు సాల్లు జొన్న పంటను వేసుకోవాలని, దీని వల్ల రసం పీల్చే పురుగులను నివారించ వచ్చునని తెలిపారు.ప్రతి ఒక్కరూ 'ఈ పంటను తప్పని నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె పరిధిలోని రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మండలంలోని పెద్ద ఎరసాల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ ఒఎల్ఎఫ్ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. ఆపరేషన్ నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వైద్య సిబ్బంది తెలిపారు. ఆమె బంధుమిత్రులు రక్తం కోసం ప్రయత్నంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ స్పందించి, పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కావడి మహేష్ రక్త దానం చేయించారు. కార్యక్రమంలో వల్లం వీరనారాయణ, మోపూరి గోపి పాల్గొన్నారు.

శంకర్ రెడ్డిని సన్మానిస్తున్న బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

- టూరిజం డైరెక్టర్ బెల్లం ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధి డైరెక్టర్ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి అధికారులను కోరారు. విజయవాడలోని పలు అధికారుల కార్యాలయాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. చిలేకాంపల్లె దళితవాడలో రామాలయం నిర్మించాలని, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను కలిసి విన్నవించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, రామాలయం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా ఎన్నికైన ఎస్‌వి శంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

'అయాన్ బజాజ్' బంపర్ ఆఫర్

- వాహనం కొనుగోలుపై రూ.8 వేలు తగ్గింపు

ప్రజాశక్తి - వేంపల్లె

పట్టణంలోని ఆయాన్ బజాజ్ షోరూం వాహన దారులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ప్రతి వాహనంపై రూ 8 వేలు తగ్గిస్తున్నట్లు తెలిపింది. శనివారం బజాజ్ షోరూం అథరైజ్డ్ సర్వీసింగ్ సెంటర్ ఎమ్‌డి డాక్టర్ ఇబ్రహీం విలేకర్లతో మాట్లాడుతూ నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభం సందర్భంగా ఆదివారం ఒక రోజు తమ ఆయాన్ బజాజ్‌లో వాహనాలు కొనుగోలు చేసిన వారికి బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలిపారు. వాహనంపై రూ .8 వేలు తగ్గింపుతోపాటు ప్రతి వాహనానికి 10 ఉచిత సర్వీసులు చేస్తామని తెలిపారు. వాహనానికి ఎక్స్‌ట్రా ఫిట్టింగ్స్, సీట్‌తో పాటు ట్యాంక్ కవర్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. 6 సంవత్సరాల వారంటీతో పాటు స్పాట్ డెలివరీ, స్పాట్ ఫైనాన్స్,స్పాట్ ఎక్స్చేంజ్ లాంటి బంఫర్ ఆఫర్లు పెట్టినట్లు చెప్పారు. టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్న శుభ సందర్భంగా ప్రజలకు ఆఫర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఆయాన్ బజాజ్ ఇచ్చే అవకాశాన్ని వేంపల్లె మండలంలో ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాహనాలు అవసరమైన వారు 99590 71185, 9441576464లలో సంప్రదించాలని సూచించారు.

సమాజ మార్పునకు కృషి

ప్రజాశక్తి-ప్రొద్దటూరు

ప్రతి కళాకారుడూ తన కళ ద్వారా సమాజంలో మంచి మార్పుకు కృషి చేయాలని ప్రముఖ గాయకురాలు సుశీల అన్నారని, ప్రొద్దటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయులురెడ్డి (మహేష్‌ఆర్ట్స్) అన్నారు. చెన్నైలో సుశీల కార్యాలయంలో శనివారం ఆమె స్వీయచిత్రపటాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. సేవ్‌గర్ల్‌చైల్డ్‌తో చేసిన ఈ ప్రాజెక్ట్‌ను ఎంతగానో మెచ్చుకున్నారన్నారు. స్త్రీలు అన్నిరంగాల్లో ముందుండాలని కోరారు. ప్రతిమహిళా ఉన్నత చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. మహిళల్లో చైతన్యానికి కృషి చేస్తున్న చిత్రకారుడి సేవలు ప్రశంశనీయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ గౌరవసలహాదారు నారాయణ,ఆర్టిస్ట్ కుమారి ప్రసన్న పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి వై.ఎస్.జగన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని వైసిపి మండల ఇన్‌ఛార్జి వై.ఎస్. అభిషేక్‌రెడ్డి చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్, కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన పంటల బీమాలో అధిక శాతం రైతులకు పరిహారం లభించింది అన్నారు. ముఖ్యంగా చీనీ రైతులకు సంబంధించి రూ. 15.96 కోట్లు పరిహారం రైతుల ఖాతాలో జమ చేశారన్నారు. దీంతో పాటు వేరుశనగ, పత్తి, కంది రైతులకు సైతం జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ శివ ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామమోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు బి.ఎన్ బ్రహ్మానందరెడ్డి ,అరవిందనాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సీతారామరెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, చంద్రహాస్ రెడ్డి, లారీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గండికోటలో కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన గండికోటలో సమస్యలను పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరారు. శనివారం గండికోటలో తహశీల్దార్ గుర్రప్ప, అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు ఏమైనా ఉన్నాయని అడగగా ప్రజలు నీటి సమస్య అధికంగా ఉందని పరిష్కరించాలన్నారు. ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. శని, ఆదివారాలలో గండికోటకు అధికంగా ప్రజలు వస్తారని అందుకు సంబంధించిన కనీస వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహశీల్దార్ గుర్రప్ప మాట్లాడుతూ సంబంధిత ఉన్నత అధికారులకు సమస్యలన్నింటినీ తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

బద్రిపల్లె చర్చికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- చాపాడు

మండల పరిధిలోని బద్రిపల్లె ఎస్‌సి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయబోయే చర్చి నిర్మాణానికి విశ్వనాథాపురం గ్రామానికి చెందిన ఇఆర్‌కెఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ఇరగంరెడ్డి కార్తీక్ రెడ్డి శనివారం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఐక్యతతో ప్రజలు చర్చి నిర్మాణానికి నడుంబిగించారన్నారు. తన వంతు సాయంగా చర్చి నిర్మాణానికి ఆర్థిక అందిస్తున్నామన్నారు. ట్రస్టు తరపున ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు కార్తీక్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

25న అల్లాడుపల్లెకు పీఠాధిపతి రాక

ప్రజాశక్తి- చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయానికి హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాకుళం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి ఈనెల 25న వస్తున్నట్లు ఆలయ ఇఒ శ్రీనివాసులు తెలిపారు. ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. స్వామి వారి లీలా విలాసం ప్రవచనాలు బోధిస్తారని తెలిపారు. భక్తులు ప్రవచనాల కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

నేతన్నలకు ఆపన్న హస్తం

ప్రజాశక్తి- ముద్దనూరు

వైఎస్ఆర్ నేతన్న నేస్తం చేనేతలకు ఆపన్నహస్తమని వైసిపి నాయకులు వీర ప్రతాప్, విశ్వనాథ రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం వైసిపి నాయకులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాల వీరయ్య,వార్డు మెంబర్ సిద్ధు, అంకాల్ రెడ్డి, సుబ్బయ్య, శివప్రసాద్, సంజీవ రెడ్డి, గంగా ధర, కిరణ్, ప్రతాప్ పాల్గొన్నారు.